# పులిదాడిలో ఆవు మృతి

## రైతుకు నష్ట పరిహారం అందజేత



రైతు లక్ష్మయ్యకు చెక్కు అందజేస్తున్న ఎఫ్ఆర్వో సుభాష్

హాజీపూర్, జనవరి 11 : లక్షెట్టిపేట ఫారెస్టు రేంజ్ పరిధిలోని హాజీపూర్ సెక్షన్‌లో నాగారం బీట్‌లో శుక్రవారం పులిదాడి చేయడంతో దుబ్బగూడేనికి చెందిన రైతు గోపతి లక్ష్మయ్యకు చెందిన ఆవు మృతి చెందింది. శనివారం ఉదయం సమాచారం అందుకున్న లక్షెట్టిపేట ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ అధికారి (ఎఫ్ఆర్వో) అత్తె సుభాష్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. లక్ష్మయ్యకు రూ. 12 వేల చెక్కు అందజేశారు. ఫారెస్టు రేంజర్ మాట్లాడుతూ ప్రస్తుతం లక్షెట్టిపేట రేంజ్‌లో పులి సంచరిస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆయన వెంట నాగారం సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ ఉన్నారు.

# మా బస్తీలో చెత్తవద్దు

## వాహనాలను అడ్డుకున్న ప్రజలు



చెత్తవాహనాలను అడ్డుకున్న బస్తీవాసులు

బెల్లంపల్లి, జనవరి 11 : 'మా బస్తీలో చెత్తవేయవద్దు.. ఇక్కడి నుంచి డంప్ యార్డును తరలించాలి' అంటూ బెల్లంపల్లి పట్టణంలోని గోల్‌బంగ్లా బస్తీ వాసులు శనివారం చెత్త తీసుకొస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఇక్కడ చెత్త వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, అనారోగ్యంతో బాధపడుతున్నామని మండిపడ్డారు. చెత్త డంపింగ్‌తో ఇక్కడ ఉన్న సమాధులు కనిపించకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలను అడ్డుకున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అక్కడికి చేరుకోగా, స్థానికులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఇక్కడ చెత్త వేస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. దీంతో వారం గడువు కావాలని మున్సిపల్ కమిషనర్ చెప్పడంతో వారు శాంతించారు.




గోవాలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకుంటున్న ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు

# ఎస్టీపీపీకి అత్యుత్తమ అవార్డులు

జైపూర్, జనవరి11 : మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి విద్యుత్‌కేంద్రానికి ఒకే రోజు రెండు జాతీయ అత్యుత్తమ అవార్డులు లభించాయి. శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో కంపెనీ ప్రతినిధులు ఈ అవార్డులను అందుకున్నారు. గోవాలో మిషన్ ఎనర్జి ఫౌండేషన్ నిర్వహించిన వాటర్ అప్టిమైజేషన్ అవార్డ్స్–2025 వేడుకల్లో బెస్ట్ జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్లాంటు అవార్డుకు ఎంపికైంది. కంపెనీ తరపున జీఎం శ్రీనివాసులు అవార్డు అందుకున్నారు. ఇక దేశరాజధాని ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ పవర్ జనరేషన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డ్స్–2025లో ఎస్టీపీపీకి 'బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు వచ్చింది. కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్స్‌లెన్స్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీపీపీ తరపున డీజీఎం పంతుల ఈ అవార్డు అందుకున్నారు. దేశంలోని విద్యుత్ కేంద్రాల్లో అత్యల్పంగా నీటిని వినియోగించినందుకుగాను ఈ అవార్డుకు ఎస్టీపీపీ ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడంపై సీఎండీ బలరాం, డైరెక్టర్ ఈ అండ్ఎం సత్యనారాయణ, ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో గంట సమయంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి గరిష్ఠంగా మూడు ఘనపు మీటర్ల నీటిని వినియోగించడం ఒక ప్రామాణికం కాగా, సాధారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఈ ప్రమాణాన్ని దాటే నీటి వినియోగం ఉంటుందని, సింగరేణి విద్యుత్ కేంద్రంలో మాత్రం 2.5 ఘనపు మీటర్ల నీటి వినియోగంతోనే గంట సమయంలో మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

# ఎంసీహెచ్‌లో వ్యాక్సిన్ల కొరత..!

## వచ్చి వెనుదిరిగిన పిల్లల తల్లిదండ్రులు



వ్యాక్సిన్ కోసం ఎంసీహెచ్‌కు వచ్చిన మహిళలు


మంచిర్యాల అర్బన్, జనవరి 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులోగల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో (ఎంసీహెచ్) వ్యాక్సిన్ల కొరత ఏర్పడింది. శనివారం చంటిపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులకు వ్యాక్సిన్లు లేవని, మరో వారం తర్వాత రావాలని అక్కడున్న సిబ్బంది తెలపడంతో వెనుదిరిగారు. సర్కారు దవాఖానల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచకుంటే ఎలాగని వారు అసహనం వ్యక్తం చేశారు. ఇక ఈ విషయమై జిల్లా వ్యాక్సినేషన్ అధికారిణి డా.అనితను వివరణ కోరగా ప్రస్తుతానికి నెలన్నర సమయంలో వేసే ఐపీవీ, పెంట వ్యాక్సిన్ల కొరత ఉందని, హైదరాబాద్ నుంచి ఒకటీ రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు. వ్యాక్సిన్ల కోసం ఎంసీహెచ్‌కు రాకుండా అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు వెళ్లాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అన్ని వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

# రోడ్లు పూర్తయ్యేదెప్పుడో!

**బీఆర్ఎస్ హయాంలో కోటపల్లి మండలంలోని పలు రోడ్లకు నిధులు**

- శంకుస్థాపనలు సైతం చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- గుత్తేదారు నిర్లక్ష్యంతో రద్దైన టెండర్లు
- ఇప్పటికీ పెండింగ్‌లోనే పనులు
- వేరే నిర్మాణాలకు డీఎంఎఫ్‌టీ నిధులు మళ్లించారనే ఆరోపణలు
- సర్కారు స్పందించకుంటే ఆందోళనలు తప్పవంటున్న ప్రజలు

మంచిర్యాల, జనవరి 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ సర్కారులో చెన్నూర్ నియోజకవర్గం ప్రగతిలో పరుగులు పెట్టింది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కోట్లాది నిధులు తెచ్చి రోడ్లు, వంతెనలు నిర్మించగా, దశాబ్దాల 'దారి'ద్ర్యం పోయింది. ఇక ఎన్నికలకు ముందు కోటపల్లి–పారుపల్లికి 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 5.60 కోట్లు, అక్కడి నుంచి రాచర్లకు రోడ్డు వేసేందుకు రూ 1.60 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పట్టింపులేని తనంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. సంబంధిత నిధులను సైతం వేరే పనులకు మళ్లించారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, ఈ విషయంపై ఎమ్మెల్యే వివేక్ స్పష్టత ఇవ్వాలని స్థానిక ప్రజానీకం డిమాండ్ చేస్తున్నది.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
మంచిర్యాల జిల్లా, కోటపల్లి మండలంలో కోటపల్లి
నుండి పార్‌పల్లి వరకు కి.మీ. 0/0 నుండి 12/0
బి.టి.రహదారి. ప్రత్యేక మరమ్మత్తులు
అంచనా వ్యయం : 560.00 లక్షలు నిధులు: DMFT 2019-20
శంఖుస్థాపన తేది: 27-04-2021
శంఖుస్థాపకులు: గౌ॥ శ్రీ బాల్క సుమన్ గారు
రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు శాసన సభ్యులు, చెన్నూర్
ముఖ్య అతిథులు: గౌ॥ శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి గారు
రాష్ట్ర రహదారులు & భవనములు, శాసనసభా వ్యవహారాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు
గౌ॥ శ్రీ అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గారు
రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ మరియు దేవాదాయ శాఖామాత్యులు
గౌ॥ శ్రీమతి నల్లాల భాగ్యలక్ష్మి గారు
చైర్ పర్సన్, జిల్లా ప్రజా పరిషత్, మంచిర్యాల
గౌ॥ శ్రీ బోర్లకుంట వెంకటేష్ నేత గారు
పార్లమెంట్ సభ్యులు, పెద్దపల్లి

2021లో డీఎంఎఫ్‌టీ నిధులతో రోడ్డు వేసేందుకు ఆవిష్కరించిన శిలాఫలకం

### రోడ్ల నిర్మాణానికి బ్రేక్..

మంచిర్యాల జిల్లాలోనే అత్యంత మారుమూల ప్రాంతం కోటపల్లి మండలం. ఉమ్మడి రాష్ట్రంలో ఏండ్లకేండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదు. నక్సల్స్ ప్రభావితంతో కల్లోలిత ప్రాంతంగానే చూశారు తప్పితే.. ఇక్కడి జనాల గురించి ఆలోచించలేదు. కానీ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాంతం కాస్త మెరుగుపడింది. కనీస మౌలిక సదుపాయాలు లేక గోస పడ్డ జనాలకు స్వరాష్ట్ర పాలనలో ఊరట లభించింది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వందల కోట్ల నిధులు తీసుకొచ్చి కోటపల్లి మండలంలోని వాగులు.. వంకలపై వంతెనలు నిర్మించి దశాబ్దాల కలను నెరవేర్చారు. ఆయన హయాంలో దాదాపు నియోజకవర్గంలో 40కిపైగా బ్రిడ్జిలు నిర్మించారు. ఈ క్రమంలో 2024లోనూ మరిన్ని కొత్త రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు తీసుకువచ్చారు. కొబ్బరికాయలు కొట్టి, శంకుస్థాపనలు సైతం చేశారు. కానీ.. ఆ సమయంలోనే ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో ఆ పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో ఆ నిర్మాణాలు ఎప్పుడు పూర్తి చేస్తారంటూ నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### మార్పుకోసం ఓట్లేస్తే..

మార్పు కోసమంటూ హస్తం పార్టీకి ఓట్లు వేస్తే ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదు. గత ఎమ్మెల్యే హయాంలో వచ్చిన డీఎంఎఫ్‌టీ నిధులతోనే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడం తప్ప కొత్త పనులు తెచ్చింది లేదనే చర్చ జోరుగా నడుస్తున్నది. ఏదో చేస్తారని ఆశ పడి గెలిపిస్తే ఉన్నది పోయే, ఉంచుకున్నదీ పోయే అన్నట్లుగా పరిస్థితి మారిందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కోటపల్లి మండలంలో గత ప్రభుత్వం మొదలుపెట్టిన రోడ్లపై అగ్గిరాజుకుంది. కోటపల్లి నుంచి పారుపల్లి, అక్కడి నుంచి రాచర్లకు రోడ్ల నిర్మాణం చేయాలంటూ స్థానికుల నుంచి డిమాండ్ మొదలైంది. బీఆర్ఎస్ హయాంలో బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కోటపల్లి నుంచి పారుపల్లికి 12 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ. 5.60 కోట్లు, అక్కడి నుంచి రాచర్లకు రోడ్డు వేసేందుకు రూ 1.60కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయించారు. ఈ పనులకు శంకుస్థాపనలు సైతం చేశారు. గుత్తేదారు పనులు సరిగా చేయకపోవడంలో ఆ టెండర్లను రద్దు చేశారు. మరోమారు టెండర్లకు పిలిచి పనులు చేయించాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు ఆ ఫైళ్లు ముందుకు కదలకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ప్రతిపాదిత డీఎంఎఫ్‌టీ నిధులను కాంగ్రెస్ వచ్చాక వేరే పనులకు మళ్లించారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




అధ్వానంగా ఉన్న కోటపల్లి నుంచి పారుపల్లి వెళ్లే మట్టి రోడ్డు

ఒకవేళ నిధులు ఉన్నట్లయితే పనులు చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. వర్షాకాలంలో ఆయా రూట్లలో వెళ్లాలంటే భయమేస్తుందంటున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అధికార పార్టీలీడర్లు, అధికారులు ఈ రోడ్ల నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా నిలిచిపోయిన పనులను వెంటనే చేపట్టాలని, లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### వెంటనే పనులు పూర్తి చేయాలి

*పారుపల్లి– కోటపల్లి రోడ్డు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ అసమర్థతతో ఆ టెండర్ రద్దు అయ్యింది. ఆ నిధులతో పనులు కావని మరోసారి ప్రపోజల్ పెట్టారు. అది ఇంకా అప్రూవల్ కాలేదు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మా గ్రామాల్లో రోడ్లు పడకుండా పోయాయి. మరి రెండేళ్ల క్రితం మంజూరైన డీఎంఎఫ్‌టీ నిధులు ఉన్నాయా.. వెనక్కి వెళ్లాయా.. లేకపోతే వేరే పనులకు మళ్లించారా అన్నది తెలియడం లేదు. దీనిపై అధికారులను సంప్రదించినా సరైన సమాధానం రావడం లేదు. మట్టి రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. వెంటనే ఈ రోడ్ల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. పాదయాత్ర చేయాలని నిర్ణయించాం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించకుంటే మండల ప్రజల ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం.*

*- మంత్రి రామయ్య-సురేఖ, మాజీ ఎంపీపీ కోటపల్లి*

### ప్రతిపాదనలు పంపించాం

*రెండేళ్ల క్రితమే ఈ పనులకు టెండర్లు అయ్యాయి. కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ చేశాక పనులు చేయకపోవడంతో దాన్ని రద్దు చేశారు. కానీ అప్పటికీ, ఇప్పటికీ అంచనా వ్యయం పెరిగింది. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వాటిపై ఏ నిర్ణయం రాలేదు. వచ్చిన డీఎంఎఫ్‌టీ నిధులు అలాగే ఉంచారా.. వేరే పనులకు మళ్లించారా అన్నది మాకు తెలియదు. నిధులు మంజూరై, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.*

*- రమేశ్, ఆర్అండ్‌బీ డీఈ, చెన్నూర్*




శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కాంటాక్టు కార్మికులు

# కనీస వేతనాలివ్వాలి

- కాంట్రాక్టు కార్మికుల డిమాండ్
- శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

శ్రీరాంపూర్, జనవరి 11 : కనీస వేతనాలతో పాటు హైపవర్ కమిటీ ఒప్పంద వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముందు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు జీఎం ఆఫీస్ వరకు ర్యాలీ తీశారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలు కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాశ్వత కార్మికులను, కాంట్రాక్టు కార్మికులను ఒకే విధంగా చుడాలన్నారు. కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ ఒప్పంద వేతనాలు సింగరేణిలోనూ అమలు చేయాలని, లేదంటే పోరాటం తప్పదన్నారు. అనంతరం జీఎం సూర్యనారాయణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి పల్లె సత్యం, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు సమ్మయ్య, గణేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, కొమురయ్య, విజయ్, బాపు, లింగయ్య, శ్యామల, అనిత పాల్గొన్నారు.







పచ్చగా కళకళలాడుతున్న అటవీశాఖ నర్సరీ (ఫైల్)

# నాడు కళకళ.. నేడు వెలవెల

మైదానంలా మారిన తాండూర్ అటవీశాఖ నర్సరీ

*కేసీఆర్ సర్కారు హరిత తెలంగాణే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈ మేరకు ఊరూరా నర్సరీలు ఏర్పాటు చేసి.. కోట్లాది మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వైపు దృష్టి పెట్టకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారాయి. మొక్కలు.. చెట్లన్నీ ఎండిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. నాడు పచ్చదనంతో కనువిందు చేసిన తాండూర్ మండల కేంద్రంలోని నర్సరీ ప్రస్తుతం ఇలా కళావిహీనంగా మారడంపై పర్యావరణ ప్రేమికులు విమర్శలు గుప్పిస్తున్నారు.* *- తాండూర్, జనవరి 11*

# డార్ఫ్ ఆశయాలను సాధించాలి

- అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు
- మార్లవాయిలో ఘనంగా 38వ వర్ధంతి



డార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, జనవరి 11 : ఆదివాసుల ఆత్మబంధువు, మానవ పరిణామ శాస్త్రవేత్త బెట్టి ఎలిజబెత్ హైమన్ డార్ఫ్ దంపతుల ఆశయాలను సాధించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం జైనూర్ మండలం మార్లవాయిలో డార్ఫ్ దంపతుల 38వ వర్ధంతికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు ఎస్పీ సన్‌ప్రీత్ హాజరయ్యారు. ఆదివాసులు గ్రామ పటేల్ ఆత్రం మానిక్‌రావ్ ఇంటి నుంచి సంప్రదాయ వాయిద్యాల నడుమ మంగళహారతులతో తరలివచ్చి సమాధుల వద్ద పూజలు చేశారు. డార్ఫ్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, డీడీ రమాదేవి, ఏపీవో మెస్రం మనోహర్, డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేశ్, ఎస్ఐలు సాగర్, రామకృష్ణ, ఏటీడీవో శ్రీనివాస్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, డైరెక్టర్ కొడప హన్మూ పటేల్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు మడవి భీంరావ్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, మాజీ ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, కొడప ప్రకాశ్, బీఆర్ఎస్ సిర్పూర్(యూ) మండల అధ్యక్షుడు తోడసం ధర్మరావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ బీర్‌షావ్, ఏపీవో నగేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సొంబాయి, డార్ఫ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నస్పూర్ కలెక్టరేట్‌లో ఓబన్న చిత్రపటానికి పూలమాలవేస్తున్న తిరుపతి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 11 : మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేలా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వడ్డెర కుల సంఘ నాయకులు, ప్రముఖులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉండి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దౌర్జన్యాలను ఎదుర్కొన్నారన్నారు. ఓబన్న దేశంలోని బహుజనులందరికీ గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, ఆసిఫాబాద్ మాజీ ఎంపీపీ మల్లికార్జున్, వడ్డెర కుల సంఘాల ప్రతినిధులు కనకయ్య, ముద్దంగుల హనుమంతు, కోరాల రాజు, రాపాక రమేశ్ పాల్గొన్నారు.

### నస్పూర్ కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి

మంచిర్యాలటౌన్/నస్పూర్, జనవరి 11: నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, సాయుధ పోరాట వీరుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పురుషోత్తం నాయక్, వడ్డెర సంఘం నాయకులు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర సంఘం జిల్లా నాయకుడు పల్లపు తిరుపతి మాట్లాడుతూ ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు రాజమౌళి, వోల్లపు రవి, హనుమంతు, పల్లపు సావిత్రి, రాజేశం, అధికారులు అధికారులు రాజేశ్వరి, రాజేశ్వర్ పాల్గొన్నారు .